క్లుప్తంగా

పాఠశాలను తనిఖీ చేసిన ఎస్‌డీసీ



పాఠశాల సందర్శించిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేడ్కర్, అధికారులు

రాజవొమ్మంగి: మండలంలోని లాగరాయి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపీపీ పాఠశాలలను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎస్‌డీసీ) అంబేడ్కర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలోని పిల్లలు, ఉపాధ్యాయుల హాజరు పరిగణనలోకి తీసుకొంటున్నామన్నారు. నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, ఎంఈవో సూరయ్యరెడ్డి న్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని 33/11 కేవీ ఫీడర్‌లో మరమ్మతు పనుల కారణంగా సుమారు 18 పంచాయతీల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని పోతంగి, కండ్రుమ్, తూటంగి, లైగండ, అరమ, గుంటసీమ, రంగిలిసింగి, గుంటగన్నెల, సాగర, సొవ్వ, గసభ, అరకు, కొర్రాయి, కొల్లాపుట్టు, కురిడి, కించుమండ, కితలంగి, కొర్రలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ఈ విషయాన్ని గమనించి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న సైకాలజిస్ట్

కొయ్యూరు: ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని విశాఖ స్టీల్‌సిటీ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు పి.కె.ఎం.లక్ష్మి, విశాఖ పాజిటీవ్ కేర్ సెంటర్ సైకాలజిస్ట్ బి.ఉమామహేశ్వరరావు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులతో మాట్లాడారు. ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని, ఆందోళన చెందవద్దన్నారు. విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. చదువుపై పూర్తిగా దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. పరీక్షలకు సంసిద్ధం కావాలని కోరారు. మానసిక వికాసంపై అవగాహన కల్పించారు. పాఠశాల పూర్వ విద్యార్థి పి.సత్యానందం, పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


చెత్త సంపద కేంద్రాల పరిశీలన



గౌరయ్యపేటలోని సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో నరసింగరావు

అడ్డతీగల: ఏజెన్సీలోని చెత్త నుంచి సంపద కేంద్రాల సమర్థ నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు డివిజనల్ పంచాయతీ అధికారి కె.నరసింగరావు అన్నారు. మండలంలోని గౌరయ్యపేట, కోనలోవ, గొండోలు, అడ్డతీగల ప్రాంతాల్లోని చెత్త నుంచి సంపద కేంద్రాలను ఆయన గురువారం పర్యటించి పరిశీలించారు. వర్మీ కంపోస్టు తయారీ, తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడం వంటివి సక్రమంగా చేపట్టాలన్నారు. అనంతరం అడ్డతీగల గ్రామ సచివాలయంలో గ్రామ కార్యదర్శులు, ఇతర సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా చేతిపంపులు పాడైతే వెంటనే మరమ్మతు చేయించాలన్నారు.

మన్యంలో మారుతున్న వాతావరణం




టిక్కిలిబెడ్డలో చలిలో మంట వద్ద గ్రామస్తులు

డుంబ్రిగుడ: మన్యంలో వాతావరణ పరిస్థితులు మారాయి. ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉదయం 11 గంటల తరువాత ఎండ ఎక్కువగా ఉంటుంది. అయితే సాయంత్రం 5 గంటల నుంచి చలిగాలులు వీస్తున్నాయి. ఉదయం 8గంటల వరకు మంచు కురుస్తోంది. దీంతో విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు బాగా ఇబ్బంది పడుతున్నారు. చలిమంటతో ఉపశమనం పొందుతున్నారు. లైట్ల వెలుగులో వాహనచోదకులు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం మండలంలోని 12 డిగ్రీల నుంచి 13 డిగ్రీల చలి నమోదవుతున్నట్టు అధికారులు తెలిపారు.

చెక్ ధాం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేసింది. రైతును రాజుగా.. వ్యవసాయాన్ని పండగగా మార్చింది. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతకు అండగా నిలిచి కోట్లాది రూపాయలు అందజేశారు. పెట్టుబడి సాయం నుంచి పంట కొనుగోలు వరకు అన్ని విధాలుగా ఆదుకున్నారు.. ఎటువంటి ఆటంకం లేకుండా అన్నదాత జీవనం ఆనందంతో సజావుగా సాగింది. ఇదంతా నాటి ఘనం.. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో రైతుల కష్టాలు వర్ణనాతీతం. పెట్టుబడి సాయం లేక.. సాగునీరందక.. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్లెదుటే ఎండిపోతుండడంతో అల్లాడిపోతున్నారు. కూటమి ప్రభుత్వం అన్నదాతకు వ్యవసాయం.. భారంగా మార్చేసింది.



లక్ష్మీపేట డ్యాం దుస్థితి

- శిథిలమైన చెక్‌డ్యాంలు
- నీరందక ఎండిపోతున్న పంటలు
- ఆందోళనలో రైతులు
- పట్టించుకోని అధికారులు

పెదబయలు: వ్యవసాయానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తామని కూటమి ప్రభుత్వం చేసిన ప్రకటనలు కాగితాల వరకే పరిమితం తప్పా అమలు మాత్రం జరగడం లేదు. సాగునీటి సదుపాయం కరువైంది. ఫలితంగా పంటలు ఎండిపోతున్నాయి. పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో 22 ఏళ్ల క్రితం నిర్మించిన చెక్‌డ్యాంలు పూర్తిగా పాడయ్యాయి. అధికారుల నిర్లక్ష్యం..గిరిజన రైతుల పాలిట శాపంగా మారింది. రబీకు సాగుకు నీరు కరైంది.

దీంతో మండలంలో అత్యధికంగా చెక్‌డ్యాంల కింద సాగవుతున్న వరి పొలాలు ఎండిపోతున్నాయి. మండలంలోని 23 పంచాయతీల్లో 85 చెక్‌డ్యాంలను 22 ఏళ్ల క్రితం పాడేరు ఐటీడీఏ ద్వారా నిర్మించారు. వీటిలో 60 శాతం చెక్‌డ్యాంలు శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు సాగునీటి కాలువలు ధ్వంసమై నీరంతా వృథాగా పోతుండడంతో కిందనున్న వరి పొలాలకు నీరందడం లేదు. దీంతో రబీ కష్టకాలంగా మారిందని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో సీజన్‌కు ముందుగానే విత్తనాల పంపిణీ, పెట్టుబడి సాయంతో పాటు సమృద్ధిగా సాగునీరందేలా యంత్రాంగం పర్యవేక్షణతో రెండు పంటలు సాగు చేసే వారమని చెబుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ పాలనలో చెక్‌డ్యామ్‌లకు కనీస మరమ్మతు పనులు చేయపోవడంతో అధికారుల నిర్లక్ష్యం వల్ల నీరు వృథాగా పోతోందని, పంటలు ఎండిపోతున్నాయని కన్నీరుమున్నీరవుతున్నారు. గెడ్డల నుంచి నీరు పారుతున్న ఏమి చేయలేని స్థితిలో ఉన్నామని ఆవేదన చెందుతున్నారు.

తగ్గిన వరి సాగు విస్తీర్ణం

మండలంలోని గోమంగి పంచాయతీ సరియాపల్లి, కుమ్మరవీధి చెక్‌డ్యాంలు, లక్ష్మీపేట చెక్‌డ్యాం, పాములపుట్టు చెక్‌డ్యాం, అడుగులపుట్టు పంచాయతీ అల్లంపుట్టు చెక్‌డ్యాం, కొరవంగి, గిన్నెలకోట, గలగండ, సిరసపల్లి, అరడకోట, సీకరి, కుంతుర్ల, లింగేటి, బొంగరం పంచాయతీల్లో చెక్‌డ్యాంలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో పంటలకు సాగునీరు అందక ఖరీఫ్‌లో వరి సాగు ఎక్కువగా చేయలేనట్టు తెలిసింది. ఆయా ప్రాంతాల్లో కొన్నిచోట్ల ఊట గెడ్డలు, కొండవాలు నుంచి..మరికొన్ని చోట్ల చెక్‌డ్యాంల ద్వారా అరకొర నీరందడంతో సాగు పనులు చేస్తున్నట్టు రైతులు చెబుతున్నారు. దీంతో మండలంలో చాలా తక్కువ విస్తీర్ణంలో ఖరీఫ్ వరి సాగు జరుగుతుంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఐటీడీఏ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చెక్‌డ్యాంలకు మరమ్మతులు చేపట్టి సాగునీరు అందుబాటులోకి తీసుకురావాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



మండలంలోని పాడైన చెక్‌డ్యాంలకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలి. సాగునీరు వృథాగా పోవడంతో పంటలకు నీరందడం లేదు. దీంతో వర్షాధారంపైనే సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం స్పందించాలి.

– కూడ మత్స్యకొండబాబు, వైస్ సర్పంచ్, గోమంగి పంచాయతీ

అధికారుల నిర్లక్ష్యం



మండలంలోని చెక్‌డ్యాంలు పాడైనా మరమ్మతు పనులకు అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. గతంలో రెండు పంటలు పండించే వరి పొలాలు.. నేడు ఒక్క పంట సాగు కష్టంగా మారింది. సాగునీరు లేక వర్షాధారంపై రైతులు ఆధారపడాల్సి వస్తుంది. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి, శిథిలావ్యస్థకు చేరిన చెక్‌డ్యాంలను మరమ్మతులు చేపట్టాలి.

– గుల్లేలు కృష్ణారావు, సర్పంచ్, సీకరి పంచాయతీ, పెదబయలు మండలం

ప్రతిపాదనలు పంపాం

మండలంలో కొత్త చెడ్ డ్యాంలు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. జామిగుడ చెడ్‌డ్యాం, గిన్నెలకోట, సీకరి పంచాయతీలో చెడ్‌డ్యాం నిర్మాణానికి, గంపరాయి పంచాయతీలో ఒకటి, పెదకోడాపల్లి పంచాయతీలో–2.కిముడుపల్లి పంచాయతీలో–1 చెడ్ డ్యాం మరమ్మతు పనులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే ఎన్నికల కోడ్ వలన పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఉన్నతాధికారుల సూచనల మేరకు చెక్ డ్యాంల మరమ్మతు పనులు చేపడతాం.

– జనార్ధన్,డీఈ, ఎస్ఎంఐ,పెదబయలు.

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుల నియామకం



స్వాభి రామ్మూర్తి



కొర్రా సూర్యనారాయణ



పాంగి పరశురామ్



పాంగి బొంజుబాబు



మజ్జి చంద్రబాబు



పాంగి పద్మారావు

అరకులోయటౌన్: అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులను పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అరకులోయ నియోజకవర్గం పరిధిలోని ఆరు మండల పార్టీ అధ్యక్షులను నియమించారు. ఇందులో భాగంగా అరకులోయకు స్వాభి రామ్మూర్తి, డుంబ్రిగుడకు పాంగి పరశురామ్, అనంతగిరికి కొర్రా సూర్యనారాయణ, హుకుంపేటకు పాంగి బొంజుబాబు(అనిల్), పెదబయలుకు మజ్జి చంద్రబాబు, ముంచంగిపుట్టుకు పాంగి పద్మారావులను నియమించినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటించారు. వీరు వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులుగా కొనసాగుతారని పేర్కొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



సీతపల్లిలో స్పీడ్ స్టాపర్ల ఏర్పాటును పరిశీలిస్తున్న సీఐ రవికుమార్, ఎస్ఐ వెంకటరావు

రంపచోడవరం: మండలంలోని ఐ.పోలవరం జంక్షన్‌కు సమీపంలోని సీతపల్లి వద్ద జాతీయ రహదారి మలుపులో అనేక ప్రమాదాలు జరగడంతో యాక్సిడెంట్ స్పాట్‌గా గుర్తించినట్టు రంపచోడవరం సీఐ రవికుమార్ చెప్పారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ప్రమాదాలు నివారించేందుకు డీఎస్పీ సాయి ప్రశాంత్ ఆధ్వర్యంలో నివారణ చర్యలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా గురువారం ఈ ప్రాంతంలోని రహదారి మలుపు వద్ద స్పీడ్ స్టాపర్లు ఏర్పాటు చేసి వాటిపై రేడియం స్టిక్కరింగ్ చేయించినట్టు తెలిపారు. ఎస్ఐ వెంకటరావు మాట్లాడుతూ వాహనచోదకులు మలుపులు వద్ద జాగ్రత్తగా వెళ్లాలని, తక్కువ వేగంతో వాహనాలు నడపాలన్నారు.

తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు

గూడెంకొత్తవీధి: వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా సమ్మర్ క్రాష్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్టు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కల్యాణ్‌తో కలిసి గురువారం ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. మండలంలో సుమారు 247 చేతిపంపులున్నాయన్నారు. వీటన్నింటినీ ప్రత్యక్షంగా పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేసే విధంగా సంచార వాహనాన్ని సిద్ధం చేశామన్నారు. ఎక్కడ చేతి పంపు పనిచేయక పోయినా సమాచారం ఇస్తే వాటిని బాగు చేసే విధంగా కార్యాచరణ రూపొందించినట్టు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమం మార్చి 15 వరకూ కొనసాగుతుందన్నారు. పరిపాలనాధికారి ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మర్ క్రాష్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఏఈఈ

కాఫీ రైతులకు గిట్టుబాటు ధరలు



జీసీసీ బీఎం విజయ్‌కుమార్

గూడెంకొత్తవీధి: గిరిజన రైతులు సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న కాఫీకి గిట్టుబాటు ధరలు చెల్లిస్తున్నట్టు జీసీసీ బీఎం శరమండ విజయ్ కుమార్ గురువారం తెలిపారు. జీసీసీ ఎండీ కల్పనా కుమారి కాఫీ చెర్రీ ధరలు కిలో రూ.330 ప్రకటించారన్నారు.గతంలో తమ జీసీసీ గూడెంకొత్తవీధి మండలంలోని పలు గ్రామాల్లోని రైతులకు సేంద్రియ సాగు ధృవపత్రాలను జారీ చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. ఆర్గానిక్ పంటగా గుర్తింపు పొందిన కాఫీకి మంచి ధరలు ఉన్నందున రైతులు తమ పరిధిలోని జీసీసీకి కాఫీని విక్రయించాలని కోరారు. రైతులకు బోనస్‌తో పాటు పంట రుణాలను అందిస్తామని బ్రాంచి మేనేజరు తెలిపారు.

110 కిలోల గంజాయి పట్టివేత

- ఆటో సీజ్, ఇద్దరు రిమాండ్‌కు తరలింపు

పెదబయలు: మండలంలోని సీకరి పంచాయతీ పన్నెడ జంక్షన్‌లో వాహన తనిఖీలు చేస్తుండగా ఆటోలో తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నట్టు ఎస్ఐ కె.రమణ అన్నారు. మండలంలోని పన్నెడ జంక్షన్‌లో వాహన తనిఖీలు చేస్తుండగా ఆటోలో అనుమానస్పదంగా ముంచంగిపుట్టు భూషిపుట్టు నుంచి పెదబయలు మీదుగా ఒడిశా తరలిస్తున్న 100 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఆయన చెప్పారు. గంజాయి రవాణా చేస్తున్న ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా, చిత్రకొండ బ్లాక్, డోలిపుట్టు పంచాయతీ నిమ్మవీధి గ్రామానికి చెందిన గలంగి బాలకృష్ణ, కుమడ బాలరాజు అదుపులో తీసుకుని ఇద్దరు నిందుతులపై ఎన్‌డీపీఎస్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు. ఆటోను సీజ్ చేశామన్నారు.



పట్టుబడిన గంజాయి, నిందితులతో ఎస్ఐ రమణ, సిబ్బంది

పనసకు గిరాకీ

డుంబ్రిగుడ: పనస పిందేలు విక్రయాలతో గిరిజనులు లభాలు పొందుతున్నారు. మండలంలోని అరకు వారపు సంతను ప్రతి శుక్రవారం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం నుంచి వారపు సంత మొదలవుతుంది. ఆంధ్ర–ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి వ్యాపారులు గురువారం సాయంత్రం చేరి అటవీ ఉత్పత్తులు, వ్యవసాయ పంటలను కొనుగోలు చేస్తుంటారు. ఈ వారం పిందే దశలో ఉన్న పనస కాయలను కొనుగోలు చేశారు. కేజీ పనస మొదటి రకం రూ.40లు, రెండో రకం రూ.30 లకు ఒడిశా పాడువా, చటువాకు చెందిన వ్యాపారులు గిరిజనుల వద్ద కొనుగోలు చేశారు. వీటిని ఛత్తీస్‌ఘడ్, బీహార్ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తామని వ్యాపారుల తెలిపారు. పపసపిందేలు అమ్మకాలతో ఆర్థికాంగా లాభలు పొందుతున్నామని గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మన్యం పనసపిందేలకు మైదాన ప్రాంతంతో పాటు ఇతర రాష్ట్రాల్లో మంచి గిరాకీ ఉందనిఇ, రానున్న రోజుల్లో ధరలు పెరిగే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.



పనస పిందెలు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

అగాధం.. ఆదమరిస్తే ప్రమాదం



జీకే వీధిలో ప్రమాదకరంగా మారిన రహదారి

గూడెంకొత్తవీధి: మండలంలో ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. ఆర్.వి.నగర్ నుంచి మొదలుకుని సీలేరు వరకూ పలుచోట్ల పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ప్రధానంగా గూడెంకాలనీ, ఆర్.వి.నగర్, పాతవీధి గ్రామాల మధ్య రహదారి దెబ్బతింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారుల అంచులు దెబ్బతిన్నాయి. సంక్రాంతి లోపే రహదారులను బాగు చేస్తామని గోతుల్లేకుండా చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయినా కనీసం అధికారులు ఈ గోతులను పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోతులను రాళ్లు, మట్టితో కూడా పూడ్చడం లేదంటున్నారు. దీంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాలు పోతేనా కానీ ప్రభుత్వానికి పట్టదా అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి పార్టీల జెండాలు, ఫ్లెక్సీల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



జనసేన కార్యాలయంలో జెండాలు, ఫ్లెక్సీలు(నాడు)



తొలగించిన జెండాలు, ఫ్లెక్సీలు (నేడు)

పాడేరు రూరల్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా జిల్లా కేంద్రంలోని నక్కలపుట్టు, సేరుబయలు, ఎస్పీ కార్యాలయం సమీపంలోని జనసేన కార్యాలయం తదితర ప్రాంతాల్లో కూటమి పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు తొలగించలేదు. దీనిపై పలువురు విద్యావేత్తలు, ప్రముఖులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై 'కూటమి పార్టీలకు ఎన్నికల కోడ్ వర్తించదా?' అనే శీర్షికతో ఈనెల 6న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. ఆయా ప్రాంతాల్లోని కూటమి పార్టీల జెండాలు, ఫ్లెక్సీలను తొలగించారు.



టీడీపీ నేత ఇంటి వద్ద పార్టీ జెండా (నాడు)



తొలగించిన జెండా (నేడు)



పాడేరు-విశాఖ రహదారిలో టీడీపీ ఫ్లెక్సీ(నాడు)



తొలగించిన ఫ్లెక్సీ (నేడు)

రహదారి భద్రతపై అవగాహన



అరకులోయలో ర్యాలీ నిర్వహిస్తున్న డిగ్రీ కాలేజీ విద్యార్థులు

అరకులోయటౌన్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రహదారి భద్రతపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాలలోని ఎన్ఎస్ఎస్, విశాఖ ఎన్‌వైకే ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ర్యాలీని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్‌కుమార్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి భద్రత అందరి బాధ్యత అన్నారు. ఎన్ఎస్ఎస్ పీవోలు వై. విజయలక్ష్మి, ఎం.సుందరీరాణి మాట్లాడుతూ యువత ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. వాహనచోదకులు అప్రమత్తంగా ఉంటూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. అధ్యాపకులు గణేష్, రాజు, లచ్చన్న, సోంబాబు, అప్పారావు, అంబికా, భవానీ, సురేష్, దోన్ను, సునీల్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

బంద్ విజయవంతం చేయండి

పాడేరు : స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు 1/70 చట్టాన్ని సవరించాలని చేసిన వాఖ్యలను నిరసిస్తూ ఈనెల 11,12 తేదీల్లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అఖిలపక్షం చేపడుతున్న రాష్ట్ర వ్యాప్త బంద్‌కు సహకరించాలని పెదబయలు జెడ్పీటీసీ సభ్యుడు కూడా బొంజుబాబు, అఖిలపక్ష నేతలు కూడా రాధాకృష్ణ, వంతాల దాస్, సీదరి రాంబాబు, కూడా సురేష్‌కుమార్, కూడా సుబ్రహ్మణ్యంలు కోరారు. పాడేరు ఎమ్మెల్యే, అల్లూరి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆదేశాల మేరకు మన్యం బంద్‌కు సహకరించాలని కోరుతూ ఆర్టీసీ డిపో కార్యాలయ సిబ్బంది, డీఎస్పీ కార్యాలయంలో సిబ్బందికి గురువారం వినతిపత్రాలను అందజేశారు. 48 గంటల బంద్‌ను శాంతియుతంగా నిర్వహించి తమ నిరసనను రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. ఈ బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.



ఆర్టీసీ డిపో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష నాయకులు

దుర్గంధంతో సతమతం

ముంచంగిపుట్టు: మండలంలోని జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలో పలు ప్రాంతాల్లో చెత్తా చెదారం పేరుకుపోయి ఉంది. రోజులతరబడి చెత్తను తొలగించకపోవడంతో పరిసరాలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. పంచాయతీ కేంద్రం నుంచి ఒడిశా వైపు వెళ్లే మార్గం కుప్పలు కుప్పలుగా చెత్త ఉంది. తీవ్ర దుర్గంధంతో ఈ రాకపోకలు సాగించలేక పోతున్నామని, ముక్కుమూసుకొని వెళ్లాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలు, ఈగల బెడద ఎక్కువైందని, రోగాలు ప్రబలుతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.తక్షణమే పంచాయితీ అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని కోరుతున్నారు.



జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలో పేరుకుపోయిన చెత్త

ప్రీస్కూల్ నుంచే విద్యపై అవగాహన

మారేడుమిల్లి : బాల, బాలికలకు నర్సరీ నుంచే విద్యపై అవగాహన కల్పించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. మండలంలోని సున్నంపాడు, నూరుపూడి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బాల, బాలికలకు పౌష్టిక అహారంతో పాటు ఆటపాటలతో చదువు నేర్పించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పాలు, గుడ్ల సరఫరా, స్టాక్‌ను పరిశీలించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబంలో 90 రోజులు ఉపాధి కూలి పనులు కల్పించాలన్నారు. సున్నంపాడు నుంచి నూరుపూడి వరకు మంజూరైన రహదారి పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. నూరుపూడి కాలుపై వంతెన నిర్మాణం గురించి పరిశీలించారు. పీఎం జన్‌మన్ పథకం ద్వారా మంజూరైన గృహ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట వివిధ శాఖ అధికారులున్నారు.



సున్నంపాడులోని అంగన్‌వాడీ కేంద్రంలో పాల ప్యాకెట్‌ను పరిశీలిస్తున్న పీవో సింహాచలం